సాక్షి వికారాబాద్

మంగళవారం । 26 । మార్చి । 2024




పల్లెల్లో మద్యం జోరు

పెద్దేముల్ మండలంలో బెల్టు దుకాణాలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. మద్యం, సారా విక్రయాలు జోరందుకున్నాయి. 8లో▸



రూ.3.88 లక్షల పట్టివేత

కొడంగల్ మండలం కస్తూరుపల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



న్యూస్‌రీల్

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు



నోటిఫికేషన్ పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యుల్లత

షాద్‌నగర్: పట్టణ శివారులోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యుల్లత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇంటర్ పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థినులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యజమాని, డ్రైవర్‌పై కేసు

కేశంపేట: వాగులోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన కరికే సురేశ్‌కు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ రాములు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసులు అడ్డుకుని పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుమతి లేకపోవడం ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఏఎస్‌ఐ నర్సింలు శెట్టి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

బోరు లారీ కిందపడి కూలీ దుర్మరణం

చేవెళ్ల: డ్రైవర్ నిర్లక్ష్యంతో లేబర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బామన్ పోయామి(19) మూడు నెలలుగా పట్టణంలోని శ్రీవెంకటేశ్వర్ బోర్‌వెల్స్ లారీపై పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతుకు బోరు వేసేందుకు వెళ్లారు. బోరు వేస్తుండగా బామన్ పోయామి పొలం వద్ద నిద్రకు ఉపక్రమించాడు. గమనించని డ్రైవర్ రవీందర్‌రెడ్డి బామన్‌పోయామి మీదుగా లారీని రివర్స్ తీశాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ధారూరులో ఉత్సాహంగా హోలీ ఆడుతున్న చిన్నారులు

హోలీ.. జాలీగా..

జిల్లాలో సోమవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. యువతీ యువకులు, చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. వీధుల్లోకి వచ్చి సందడి చేశారు. ఉదయం రంగులు, స్ప్రే తుపాకులు కొనుగోలు చేసేందుకు చిన్నారులు దుకాణాలకు క్యూ కట్టారు. పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



తాండూరు టౌన్‌: ఉట్టి కొట్టేందుకు సిద్ధమవుతున్న చిన్నారులు

ఆ నేతలు మనకొద్దు..!





బీఆర్‌ఎస్ నేతలను చేర్చుకోవద్దని కాంగ్రెస్ నాయకుల అల్టిమేటం

- అలా కాదని చేరికలను ప్రోత్సహిస్తే పార్టీని వీడుతామని హెచ్చరిక
- రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకునే బాధ్యత మాదేనని వెల్లడి
- సోషల్ మీడియా వేదికగా చర్చలు

వికారాబాద్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నది మొదలు అధికార పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న రంజిత్ కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి కోసం శ్రమించి ఇప్పుడు హస్తం గూటికి చేరడం, చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో నిలవడం అధికార పార్టీ శ్రేణుల్లో కలవరం సృష్టిస్తోంది. ఇప్పుడిదే ప్రధాన చర్చనీయాంశంగా మారింది. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తామని, అయితే ఆయన అనుచరులు వస్తే మాత్రం పార్టీని వీడుతామని కొందరు నేతలు తెగేసి చెబుతున్నారు. ఇదే విషయమై సోషల్ మీడియా వేదికగా వికారాబాద్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ చర్చలకు తెర లేపుతున్నారు. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరింది మొదలు ఇప్పటి వరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పర్యటించలేదు. పరిగి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మాత్రం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ సమయంలో పెద్దగా రాజకీయాలపై, ఇతర పార్టీల మీద విమర్శలేమీ చేయకుండానే తాను కాంగ్రెస్‌లో చేరటానికి గల కారణాలను వివరించే ప్రయత్నం చేశారు.

కలిసి పని చేయలేమంటున్న నేతలు

ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరింది మొదలు ఆయన వెంట ఎవరెవరు నడుస్తారనే విషయంలో ఇటు అధికార పార్టీ తోపాటు అటు బీఆర్‌ఎస్‌లో చర్చలు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ ఎంపీగా ఉంటూ జిల్లాను లీడ్ చేస్తూ వచ్చారు. ఒక్క పట్నం మహేందర్‌రెడ్డి మినహా జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషి చేశారు. పరిగి, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం ఎక్కువగా కనిపించింది. అందుకేనేమో వికారాబాద్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి ఇప్పటి వరకు రంజిత్‌రెడ్డి పార్టీ మరినా ఒక్క మాట కూడా అనలేదు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఒక్క బీఆర్‌ఎస్ నేత కూడా రంజిత్‌రెడ్డి వెంట నడవలేదు. అనుచరగణం లేకుండా ఆయనొక్కరే సాదా.. సీదాగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రంజిత్‌రెడ్డి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు ససేమిరా అంటున్నారు. బీఆర్‌ఎస్ నేతలెవరినీ, ముఖ్యంగా ఎంపీ రంజిత్‌రెడ్డి అనుచరులను పార్టీలో చేర్చుకోవద్దని తెగేసి చెబుతున్నారు. గ్రామాల్లో వారితో తాము ఇమడలేమని, వారితో కలిసి పని చేయలేమని నేరుగా స్పీకర్ వద్దే చెబుతున్నట్లు సమాచారం. వారిని చేర్చుకుంటే తాము పార్టీ వీడటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.

సహకరిస్తారా ?

రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అనేది అందరికీ తెలిసిన విషయమే. మొన్నటి వరకు నువ్వా నేనా అనే రీతిలో అసెంబ్లీ బరిలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న నేతలు ఇప్పుడు కలిసి పని చేస్తారా..? అనేది సందేహంగా మారింది. ఓ పక్క బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టగా కాంగ్రెస్ మాత్రం వెనుకబడింది. స్పీకర్ హోదాలో ఉన్న వికారాబాద్ ఎమ్మెల్యే కేడర్‌ను పురమాయించగలరే కానీ ఆయనకున్న పరిమితుల కారణంగా నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేరు. ఈ నేపథ్యంలో రంజిత్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పనిచేయాల్సి ఉంది. దీంతో ఆయనకు ఎవరెవరు సహకరిస్తారు..? ఎవరెవరు దూరంగా ఉంటారు అనేది తేలాల్సి ఉంది.

జోరుగా క్యాంపు రాజకీయాలు

- గోవాకు స్థానిక ప్రతినిధులు
- అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం



కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 28న జరగనున్న నేపథ్యంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లకు డిమాండ్ పెరిగింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రజా ప్రతినిధులను మచ్చిక చేసుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన నాయకులను క్యాంపులకు తరలించారు. ఒక పార్టీ వారు పాండిచ్చేరికి తీసుకెళ్లారు. మరో పార్టీ వారు గోవాకు తీసుకెళ్లినట్లు సమాచారం. క్యాంపులకు తీసుకెళ్లి వారికి కావాల్సిన సరంజామా సమకూరుస్తున్నట్లు ప్రచా రం జరుగుతోంది. అంతేకాకుండా ఒక్కో ప్రజా ప్రతినిధికి వారి స్థాయిని బట్టి భారీగా నగదు ముట్టజెబుతున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ప్రతినిధులను అన్ని విధాలుగా మచ్చిక చేసుకుంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్, సొంత నియోజకవర్గం కొడంగల్ కావడంతో ఎమ్మెల్సీ స్థానంపై పట్టు సాధించడానికి కృషి చేస్తున్నారు. జిల్లాలో స్థానిక సంస్థలకు ప్రతినిధులుగా ఉన్న వారు ఎక్కువ మంది బీఆర్‌ఎస్ పార్టీ వారే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. హస్తం పార్టీ తరఫున పోటీ చేసున్న మన్నె జీవన్‌రెడ్డి ఎన్నికలకు ముందుకు బీఆర్‌ఎస్ పార్టీలో ఉండేవారు. ఆయనకు బీఆర్‌ఎస్ అధిష్టానం తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ టికెట్ పొంది బరిలో నిలిచారు. ఆయన కుటుంబ సభ్యుడు వరుసకు సోదరుడి అయిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నారు. ఆయనే మళ్లీ టీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. ఒకే కుటుంబంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు రెండు ప్రధాన పార్టీల నుంచి పోటీలో నిలిచారు. విజయం కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. భారీగానే ఖర్చు పెడుతున్నట్లు స్థానిక సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. కొంతమంది మున్సిపల్ కౌన్సిలర్లను గోవాకు విమానంలో తరలించి వారి అవసరాలను తీరుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంత చేసినా రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 1,439 మంది ప్రజా ప్రతినిధులు ఓటర్లుగా ఉన్నారు. గోవా నుంచి నేరుగా ఈనెల 28వ తేదీ ఉదయం పోలింగ్ కేంద్రాలకు తీసుకొని వస్తారని తెలుస్తోంది.

ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

- శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

బడంగ్‌పేట్: మానవులు ధర్మబద్ధులుగా మెలగాలని, ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి బోధించారు. జనన, మరణాలు లేని పరబ్రహ్మాన్ని తెలుసుకోవడమే సనాతన ధర్మమని తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ ఎస్వీఆర్ గార్డెన్‌లో 98వ సనాతన వేదాంత జ్ఞానసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ.. ధర్మక్షేత్రే.. కురుక్షేత్రే అనే పదాలతో గీత ప్రారంభమైందని, ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని కోరారు. తల్లిదండ్రులు, గురువు, భగవంతుడి సేవలో తరించాలన్నారు. యజ్ఞాలు, దానధర్మాలు మానవుల విధి అని, అందరూ తప్పక ఆచరించాలని సూచించారు. సభలో భగవద్గీత ఆరు అధ్యాయాలు పారాయణం చేశారు. వాటి సారాంశాన్ని భక్తులకు వివరించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

- ఆటల్లో గెలుపోటములు సహజం
- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి



విజేతగా నిలిచిన జట్టుతో నాయకులు, నిర్వాహకులు

పెద్దేముల్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆటల్లో క్రీడాకారుడు ముందుండాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. పెద్దేముల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టోర్నీ విజేత జట్టు కింగ్స్ –11, ద్వితీయ స్థానంలో నిలిచిన ఫ్రెండ్స్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేశారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రతి ఆటలో క్రీడాకారుడు సత్తా చాటాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన వారికి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, నర్సింలు, రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మాజీ ఎంపీటీసీ విద్యాసాగర్, మాజీ సర్పంచ్ ఎర్ర బాలప్ప, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతపై హత్యాయత్నం

- హోలీ సంబరాల్లో కత్తితో దాడి
- చేతికి, మెడపై స్వల్ప గాయాలు



గాయపడిన కమలాకర్‌రెడ్డి

అనంతగిరి: పాతకక్షల నేపథ్యంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌పై.. ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ మండలం పులుసుమామిడిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కమలాకర్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఇతను సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామానికి చెందిన కొత్తగడి నాగిరెడ్డి – లలిత దంపతుల మధ్య గొడవలు జరిగాయి. ఏడాది క్రితం పంచాయితీ పెట్టారు. అప్పట్లో కమలాకర్‌రెడ్డి ఊరి పెద్దగా వెళ్లి ఇద్దరికీ సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నాగిరెడ్డికి అతని భార్య లలిత బంధువుల మధ్య వాగ్వివాదం జరిగింది. తోపులాటలో నాగిరెడ్డి కింద పడటంతో చేయి విరిగింది. దీంతో కోపం పెంచుకున్న నాగిరెడ్డి.. కమలాకర్‌రెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. సర్పంచ్‌పై దాడి చేస్తానని తరచూ చెప్పేవాడు. సోమవారం గ్రామంలో జరిగిన హోలీ సంబరాల్లో కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదే అదనుగా భావించిన నాగిరెడ్డి కత్తితో దాడి చేశాడు. చేయి అడ్డు పెట్టడంతో కమలాకర్‌రెడ్డి చేతికి, మెడకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే నాగిరెడ్డిని పక్కకు నెట్టి క్షతగాత్రుడిని హుటాహుటిన వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆస్పత్రికి చేరుకొని కమలాకర్‌రెడ్డి ఆరోగ్యంపై ఆరా తీశారు. బంధువులు, నాయకులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి తరలివచ్చి పరామర్శించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. కమలాకర్‌రెడ్డి కుమారుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

సేకరణే తరువాయి

- యాసంగి సీజన్ వడ్ల కొనుగోలుకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభం కానున్న ప్రక్రియ
- జిల్లా వ్యాప్తంగా 77 వేల ఎకరాల్లో వరి పంట సాగు
- 1.93లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా



తాండూరు: యాసంగి సీజన్‌కు సంబంధించిన వడ్లను కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి కొనుగోలు కేంద్రాలను సగం వరకు తగ్గించారు. ఏప్రిల్ రెండో వారంలో కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. నాలుగు రోజుల క్రితం ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై మార్గదర్శకాలు జారీ చేశారు. తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లో వరి పంట అధికంగా సాగు చేస్తున్నారు. గతేడాది యాసంగి సీజన్‌లో 93 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఈ సారి 77 వేల ఎకరాల్లో పంట వేశారు. మొదటి వారంలో పంట దిగుబడి చేతికందనుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 1.93 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు రావచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం 1.19లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసేందుకు లక్ష్యం పెట్టుకుంది. 27 కేంద్రాల్లో ఐకేపీ సంఘాలు, 61 కేంద్రాల్లో పీఏసీఎస్‌లు, 27 కేంద్రాల్లో డీసీఎంఎస్‌లు, మార్కెట్ కమిటీలు 3 చోట్ల, ఎఫ్‌పీఓ సంఘాలు నాలుగు కేంద్రాల్లో ధాన్యం సేకరించనున్నాయి.

తగ్గిన సాగు విస్తీర్ణం

గత ఏడాదితో పోలిస్తే ఈ సారి జిల్లాలో వరి పంట సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది 93 వేల ఎకరాలు సాగు చేయగా ఈ సారి 77వేల ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. ఈ ఏడు వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడం, వరి పంటకు నీరందక ఎండిపోతున్నాయి. గత ఏడాది 200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ సారి 122తో సరిపెట్టారు. సివిల్ సప్లైయ్ అధికారులు ధాన్యం సేకరించనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించి బియ్యంగా మార్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

జిల్లా వ్యాప్తంగా 122 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఏ ప్రిల్ రెండో వారం నుంచి ధాన్యం సేకరిస్తాం. వర్షాలు పడినా ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

– సుగుణాబాయి, డీఎం, పౌరసరఫరాల శాఖ

అంచనా కష్టం



జిల్లాలో భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో వరి పంట ఏ మేరకు వస్తుందో తెలియడం లేదు. చాలా మండలాల్లో బోరుబావుల కింద సాగుచేసిన పంట ఎండిపోతోంది.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

బొప్పునారం వాసికి ఉత్తమ కోకిల పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జానపద కళాకారుడు సలావుద్దీన్

బంట్వారం: ప్రముఖ జానపద కళాకారుడు డాక్టర్ సలావుద్దీన్‌కు ఉత్తమ కోకిల బిరుదుతో పాటు పురస్కారం దక్కింది. బంట్వారం మండలం బొప్పునారానికి చెందిన సలావుద్దీన్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో ఆదివారం సాయంత్రం జరిగిన జానపద స్వర గానానికి హాజరై పాటలతో సభికులను ఉర్రూత లూగించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరులు సలావుద్దీన్‌ని సన్మానించారు. కార్యక్రమంలో కళా వేదిక అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, ఆచార్య కుసుమకుమారి, ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ జైపాల్, కవయిత్రి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నరేశ్ (ఫైల్)

పరిగి: అతివేగంతో వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం బ్రహ్మణ్‌పల్లి పెద్దతండాకు చెందిన నరేశ్(23) తన బైక్‌పై పరిగి పట్టణానికి ఆదివారం కూలీ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలేపూల తండా దగ్గర ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ అతి వేగంతో బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న నరేశ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 ద్వారా పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

హస్తినాపురం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, పందలపాడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ (26) నగరంలోని మయూరి కమ్యూనికేషన్‌లో పనిచేస్తూ హస్తినాపురంలోని సాహితీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి రూమ్‌లోకి వెళ్లిన అతను సోమవారం బయటికి రాకపోవడంతో పక్క గదిలో ఉంటున్న యువకులు హాస్టల్ నిర్వాహకుడు సుధాకర్‌కు సమాచారం అందించారు. అతను గదికి వెళ్లి డోర్‌కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో వెంటిలేటర్‌లోంచి చూడగా కిరణ్ కుమార్ లుంగీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. సుధాకర్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వనస్థలిపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

నల్లకుంట: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై క్రిష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వడ్ల వీరమణి(50), లక్ష్మణ్ దంపతులు విద్యానగర్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 23న రాత్రి ఆస్తి విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి లోనైన వీరమణి 24న ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్లెల్లో మద్యం జోరు

బెల్టు షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. గ్రామాలన్నీ మత్తు బారిన పడి చిత్తవుతున్నాయి. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు
- పర్మిట్‌ల్లో అధిక ధరలకు విక్రయాలు



బెల్టు షాపుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లు (ఫైల్)

పెద్దేముల్: మండలంలో బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మద్యంతో పాటు సారా విక్రయాలు కూడా జోరందుకున్నాయి. చీకటి పడిందంటే చాలు పల్లెలోని బెల్టుషాపుల వద్ద మందుబాబులు బారులు తీరుతున్నారు. పెద్దేముల్ మండలంలో 37 గ్రామ పంచాయతీలు, సుమారు ఎనిమిది వరకు అనుబంధ గ్రామాలున్నాయి. ప్రభుత్వం పెద్దేముల్, తట్టెపల్లి గ్రామాలకు మద్యం దుకాణాలను మంజూరు చేసింది. వాటితో పాటు పక్కనే మద్యం ప్రియులకు పర్మిట్ రూమ్‌లు సైతం ఏర్పాటు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వాటిలో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. మద్యం షాపులు మూతపడినా యథేచ్ఛగా పర్మిట్ రూమ్‌లలో ఈ వ్యవహారం నడుస్తోంది. ఉదయం 5 గంటల నుంచే పర్మిట్ దుకాణాలు తెరచి మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

మత్తులో ఘర్షణలు

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ మండల వ్యాప్తంగా బెల్టు దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. పల్లెలో సమయానికి తాగునీరు లభించకపోయినా మద్యం మాత్రం అందుబాటులో ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. గల్లీకో బెల్టు దుకాణాలు కావడంతో రాత్రి వేళల్లో గొడవలు ఎక్కువ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. దీనికి తోడు కల్తీ కల్లు దుకాణాలు కూడా విపరీతంగా పెరిగాయి. నిబంధనల ప్రకారం లైసెన్స్‌కు ఒక్క కల్లు దుకాణం కేటాయించాలి. కానీ క్షేత్రస్థాయిలో ఒకే లైసెన్స్‌పై రెండు దుకాణాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రానికి కూడా కల్తీ కల్లును తరలిస్తున్నారు. దీంతో పల్లెలు మత్తులో మునిగిపోతున్నాయి.

రూ.20 నుంచి రూ.40 అదనంగా

మండలంలో బెల్టు దుకాణాల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు మద్యాన్ని విక్రయించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. బీరు సీసాపై సుమారు రూ.20 నుంచి రూ.30, బ్రాందీపై రూ.20 నుంచి రూ.40 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. వైన్స్ షాపుల్లో లేని బ్రాండ్లు బెల్టుషాపుల్లో ఉండటం గమనార్హం. ఎన్నికల సమయంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను ఎలా అరికట్టారో అదేవిధంగా కఠినంగా వ్యవహరిస్తే గ్రామాలు బాగుంటాయని మహిళలు, విద్యార్థులు అంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం



బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. గ్రామాలల్లో ఎవరైనా విక్రయాలు చేస్తే సమాచారం ఇవ్వండి. పోలీసుల తనిఖీల్లో భాగంగా మద్యం దొరకినా కఠినంగా వ్యవహరిస్తాం. పర్మిట్‌ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చేస్తే ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటారు.

– గిరి, ఎస్ఐ, పెద్దేముల్

తనిఖీల్లో రూ.3.88 లక్షల పట్టివేత



దౌల్తాబాద్: నగదుతో పోలీసులు

- నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొడంగల్: మండలంలోని కస్తూరుపల్లి గ్రామ సమీపంలో తెలంగాణ–కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి పోలీసుల తనిఖీల్లో రూ.2,88,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తుండగా సోదాలు చేసి నగదును సీజ్ చేశారు. ఈ మేరకు కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, మత్తు పదార్థాలు అక్రమ రవాణా కాకుండా వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి తెలంగాణకు వస్తున్న ఒక కారులో నగదును గుర్తించి సీజ్ చేశామని తెలిపారు.



కొడంగల్: పట్టుబడ్డ నగదును చూయిస్తున్న ఎస్ఐ భరత్‌రెడ్డి

చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద..

దౌల్తాబాద్: మండలంలోని అంతర్రాష్ట్ర రహదారి అయిన చంద్రకల్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి ఓ వ్యక్తి కారులో రూ.లక్ష నగదును తరలిస్తుండగా తనిఖీల్లో భాగంగా సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ముత్తురాజు సిబ్బంది ఉన్నారు.

గడ్డివాముకు నిప్పంటించిన దుండగులు

దోమ: గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పంటించారు. ఈ ఘటన మండల పరిధిలోని ఊటుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి గోపాల్ తన వ్యవసాయ క్షేత్రంలో పశువుల కోసం పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి వామును ఏర్పాటు చేసుకున్నారు. అయితే గడ్డివామును ఎవరూ లేని సమయంలో దుండగులు నిప్పంటించారు. గడ్డివాముతో పాటు పక్కనే ఉన్న పైపులు సైతం కాలిబూడిద అవుతుండడంతో స్థానికులు రైతుకు సమాచారం ఇచ్చారు. దీంతో పొలానికి వెళ్లిన గోపాల్ నిప్పంటుకున్న గడ్డివామును చూసి కన్నీటి పర్యాంతమయ్యారు. సుమారు రూ.35 వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.



కాలిపోతున్న గడ్డివాము

‘మత్తు’ వదిలించారు

- నిషేధిత మత్తుపదార్థాలు తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు
- రూ.13లక్షల విలువైన కిలో ఆల్ఫాజోలం, కారు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్



అనిల్‌గౌడ్



సుధాకర్



శరత్‌బాబు

కొత్తూరు: నిషేధిత మత్తుపదార్థం ఆల్ఫాజోలం తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం వారిని మండల కేంద్రంలో అదుపులోకి తీసుకున్నారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్లకు చెందిన అనిల్ గౌడ్(32), నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన శరత్‌బాబు(30), మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన సుధాకర్ ఏడాది క్రితం ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా నాగర్‌కరూస్‌ల్‌కు చెందిన నర్సింహులు నుంచి పెద్ద ఎత్తున ఆల్ఫాజోలం సేకరిస్తున్నారు. దీన్ని జిల్లాలోని కల్లు దుకాణాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కల్లు తాగుతున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారనే కారణంగా ప్రభుత్వం నిషేధించింది. ఉదయం పట్టణ సమీపంలోని పాత జాతీయ రహదారి విజయలక్ష్మి కూడలి వద్ద వీరి వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఆల్ఫాజోలం విషయం బట్టబయలైంది. వెంటనే వారిని అరెస్ట్ చేసి సుమారు రూ..13 లక్షల విలువైన 1,030 గ్రాముల ఆల్ఫాజోలం, కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెల్టుషాపులపై ఎస్ఓటీ పోలీసుల కొరడా

- భారీగా మద్యం పట్టివేత
- పలువురిపై కేసులు

చేవెళ్ల: డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి రాజేంద్రనగర్ ఎస్ఓటీ ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించి భారీగా మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో 10.8 లీటర్ల మద్యం, చేవెళ్ల ఠాణా పరిధిలో మూడు బెల్టుషాపులపై కేసులు 26.21 లీటర్ల మద్యం, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసులు 22.68లీటర్ల మద్యం, షాబాద్‌లో 48.75లీటర్లు, శంకర్‌పల్లిలో రెండు కేసులు 35.67లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు.

రూ.23వేల విలువైన మద్యం పట్టివేత

యాచారం: ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహులు తెలిపిన ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్లలో బక్క వెంకటేశ్ రూ.23వేల విలువైన మద్యం బాటిళ్లను ఇంట్లో నిల్వఉంచాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరిపై కేసు

మీర్‌పేట: మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై మీర్‌పేట పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడ సాయినగర్‌లో సురేందర్ తన కిరాణాషాపులో మద్యం అమ్ముతుండగా సోమవారం పోలీసులు దాడి చేశారు.

కిరాణాదుకాణంలో మద్యం అమ్మకాలు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో సోమవారం శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బి.పర్వతాలు, శ్రీను గ్రామంలో కిరాణ దుకాణంతో పాటు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు షాపులపై దాడులు నిర్వహించారు. 135.64 లీటర్ల లిక్కర్ బాటిల్స్, శ్రీను వద్ద రూ.18వేల విలువైన 31.63 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాంబండ ఆలయాభివృద్ధికి కృషి చేస్తా



పరిగి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- బంగారు కళ్లు, వెండి కిరీటం అందజేత



కుల్కచర్ల: గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ పరిధిలో అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన పాంబండ రామలింగేశ్వర దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఎమ్మెల్యేదంపతులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి బంగారు కళ్లు, అమ్మవారికి వెండి కిరీటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఆలయ పరిసరాలు ఉల్లాసంగా, ప్రశాంతతను చేకూర్చే విధంగా ఉంటుందన్నారు. ఆలయ అభివృద్ధికి వ్యక్తిగతంగా సహకరించడంతో పాటుగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ నర్సమ్మరాములు, ఈఓ సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు నాయకులు గోపాల్‌నాయక్, లక్ష్మి, వెంకటయ్య, బాలముకుందం, కుమ్మరి స్వామి, గోవర్ధన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భాస్కర్, సంజీవరెడ్డి, బచ్చిరెడ్డి, శివానంద్, సోమలింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరి పదక్షిణలు

కుల్కచర్ల: ప్రతీ పౌర్ణమి రోజున నిర్వహించే పాంబండ క్షేత్ర గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం శోభాయమానంగా కొనసాగింది. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు సోమవారం సాయంత్రం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

క్యాం‘పెయిన్’

- ఎంపీ అభ్యర్థులను హడలెత్తిస్తున్న ప్రచార కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికలు రాజకీయ పార్టీలను హడలెత్తిస్తున్నాయి. గెలుపోటములను పక్కనపెడితే.. మే 13వ తేదీ వరకు నిరంతరం ప్రచారం చేయాల్సి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కంగారు మొదలైంది. గతంలో జరిగిన పలు ఎన్నికల కంటే ఈసారి గడువు ఎక్కువ ఉండటంతో ప్రచార నిర్వహణ భారంగా మారనుంది. అభ్యర్థులు అనుచరులు, కార్యకర్తలతో 50 రోజుల పాటు ప్రజల్లో తిరగాల్సి ఉంటుంది. బహిరంగ సభలతో పాటు సమావేశాలు, ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించాలి. కార్యకర్తలను పోగుచేయడం మొదలు అంచెలంచెలుగా ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీంతో పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగే నాయకులను ‘ప్రచార భారం’ ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ ఎన్నిక తేదీ వరకు గరిష్టంగా 55 రోజులు ఉంటే.. ఈసారి 58 రోజుల గడువు ఉండటం గమనార్హం.

జనాల తరలింపు కష్టమే..

ఓ వైపు గడువు ఎక్కువ రోజులు ఉండటమే భారంగా భావిస్తున్న అభ్యర్థులకు.. ఎండలు చుక్కలు చూపనున్నాయి. దీంతో ప్రచారానికి, సభలకు జన సమీకరణ సవాలుగానే మారనుంది. మండుతున్న ఎండల దృష్ట్యా జనాన్ని తరలించడం ఈసారి ఇబ్బందిగా ఉంటుందని ప్రధాన పార్టీకి చెందిన ఒక నాయకుడు అభిప్రాయపడ్డారు. ‘ప్రచారానికి జనాలను, కార్యకర్తలను తరలించడం ప్రధాన సమస్య. అభ్యర్థులు తమ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లను కలవాలి.

వ్యక్తి బలవన్మరణం

రైలు కింద పడి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

షాద్‌నగర్: భార్య డబ్బు అడిగితే ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధి లోని లింగారెడ్డిగూడ శివారులో చోటు చేసుకుంది. కేశంపేట మండలం అవాజ్‌మియా పడకల్ గ్రామానికి చెందిన వారణాసి ఆంజనేయులు (45) ఆదివారం ఉదయం తన భార్యను ఖర్చుకు డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి చెందిన గురైన ఆంజనేయులు గ్రామ శివారుకు వచ్చి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ రఘురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

హిమాయత్ నగర్: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో నారాయణగూడ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో సుమారు వందమంది కేంద్ర సాయుధ బలగాల (సీఐఎస్ఎఫ్) సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడికి లోను కాకుండా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని సుల్తాన్ బజార్ ఏసీపీ కె.శంకర్ సూచించారు. శాంతిభద్రతలకు విఘా తం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణగూడ సీఐ చంద్రశేఖర్, డిఐ డి.నాగార్జున , ఎస్ఐ లు వెంకటేష్, శిరీష, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

తీసుకోవాలా.. వద్దా?

- కౌలు వసూలుపై స్పష్టత కరువు
- ఇటీవలే దేవాదాయ ధర్మాదాయశాఖకు ఆలయ ఈఓ లేఖ
- పాసు పుస్తకాల కోసం రైతుల డిమాండ్
- హైకోర్టు పరిధిలో కేసు



నస్దిక్‌సింగారంలో ఓంకారేశ్వరాలయ భూమిలో సాగు చేసిన పంట

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల కౌలు బకాయిల వసూలుపై సందిగ్ధత నెలకొంది. ఈ ఆలయానికి 1,452 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1,252 ఎకరాల భూమి సాగుకు యోగ్యమైంది. మరో 200 ఎకరాలు గుట్టలు, రాళ్లు, రప్పలతో ఉంది. ఈ భూమిని నందివనపర్తి గ్రామంతో పాటు నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 500కు పైగా కుటుంబాల రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. 2017కు ముందు ఓంకారేశ్వరాలయ భూముల్లో కౌలు రైతుల పేర్లు పహనీల్లో ఉండేవి. ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చిన తర్వాత ఈ భూములు ఓంకారేశ్వరుడి పేరు మీదే నమోదు చేశారు. దీంతో కౌలు రైతుల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 ఏళ్లకు పైగా ఆలయ భూములను సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం, ఏళ్ల పాటు పహనీల్లో తమ పేర్లున్నాయి. పాత రికార్డుల ప్రకారం తమ పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూముల క్రయ, విక్రయాలకు తమకు వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

ఉత్సవాలకు డబ్బు కొరత

ధరణి పోర్టల్‌లో ఆలయ ఓంకారేశ్వరుడి పేరు నమోదు చేయడంతో రైతులు నాలుగేళ్లుగా కౌలు చెల్లింపులు నిలిపేశారు. గత నాలుగేళ్లతో పాటు అంతకు ముందు పాత బకాయిలు కలుపుకొని దాదాపు రూ.10 లక్షలకు పైగా కౌలు బకాయిలున్నాయి. ఆలయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతూ ప్రతి యేటా చెల్లించే కౌలు డబ్బుతోనే ఓంకారేశ్వరుడి కల్యాణోత్సవాలు, నిత్య పూజలు నిర్వహించాలన్నది దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయం. కానీ ఓంకారేశ్వరుడికి మాత్రం పూజలు, ఉత్సవాలకు మాత్రం నిత్యం డబ్బు కొరతే ఉంటోంది.

సమాధానం వస్తేనే స్పష్టత

ఓంకారేశ్వరుడి ఆలయ భూముల్లో సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతుల నుంచి కౌలు వసూలు చేసే విషయంలో సందిగ్ధత నెలకొంది. కేసీఆర్ సర్కార్ హయాంలో ఆలయానికి చెందిన సర్వే నంబరు 163, 190, 211, 212 తదితర సర్వే నంబర్లల్లో 1,026 ఎకరాల భూమిని ఫార్మాసిటీకి సేకరించాలని నిర్ణయించింది. 1,026 ఎకరాల ఆలయ భూమిని ఫార్మాసిటీకి ఇవ్వాలని టీఎస్ఐఐసీ దేవాదాయ, ధర్మాదాయ శాఖను కోరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సైతం సమ్మతించింది. ఈ విషయం కౌలు రైతులకు చెప్పడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర హైకోర్టు సైతం దేవాదాయ, ధర్మాదాయ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉండడంతో కౌలు వసూల్ చేయాలా..? లేదా ఓంకారేశ్వరాలయ ఈఓ ప్రవీణ్‌కుమార్ దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్‌కు ఇటీవలే లేఖ రాసారు. కమిషనర్ నుంచి సమాధానం వస్తేనే అధికారులకు స్పష్టత రానుంది.



నందివనపర్తి ఓంకారేశ్వరాలయం

ఆ భూమే బతుకుదెరువు



కౌలు వసూల్ కాదు. ఏళ్లుగా ఆలయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. తమ కుటుంబ సభ్యులు ఎనిమిది ఎకరాలకు పైగా భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. ఆ భూమి లేకుంటే మాకు బతుకుదేరువే లేదు. కౌలు డబ్బులు చెల్లించేది లేదు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి. ఎన్నికల ప్రచారంలో మల్‌రెడ్డి రంగారెడ్డి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

– ఆదిరెడ్డి నర్సిరెడ్డి, కౌలు రైతు, నస్దిక్‌సింగారం